ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025
5
అనంతపురం





పెనుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న డా॥గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

ఐద్వా రంగుల హరివిల్లు

- 16వ మహాసభకు 16 వేల ముగ్గులు
- చైతన్య స్ఫూర్తి నింపేలా రంగవల్లులు
- ముగిసిన సాంస్కృతిక ఉత్సవాలు
- రేపు ఐద్వా రాష్ట్ర మహాసభ 'అనంత'లో ఆరంభం



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఐద్వా నాయకులు



మహిళల గొప్ప తనాన్ని తెలియజేస్తూ ఇంటి ముందు వేసిన ముగ్గు

ప్రజాశక్తి-అనంతపురం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా మహిళామణులు ఇళ్ల మందు రంగుల హరివిల్లును ఆవిష్కృతం చేశారు. మహిళా శక్తిని కీర్తిస్తూ.. సమానత్వాన్ని సూచిస్తూ.. పోరాటాన్ని తెలిజేస్తూ రంగవల్లులను ఇళ్ల ముందు వేశారు. 16వ మహాసభలకు గుర్తుగా 16వేల ముగ్గులను అనంతపురం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇళ్ల ముందు మహిళలు వేశారు. మల్లు స్వరాజ్యం కాలనీ, సీతారామ్ ఏచూరి కాలనీ, గణనాయక్ నగర్, మహదేవ్ నగర్, ఇందిరానగర్‌లలో ఈ ముగ్గులను వేశారు. ముగ్గులను ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తదితరులు పరిశీలించారు. మహిళల గొప్పతనాన్ని చాటేలా ముగ్గులు వేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1936లో కృష్ణాజిల్లాలో ఆంధ్ర మహిళా సంఘం ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి దేశవ్యాప్తంగా మహిళా సమస్యలపై కృషి చేస్తోందని చెప్పారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ గృహహింసవంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి ఐద్వా అనేక ఉద్యమాలను చేపట్టిందని తెలియజేశారు. లింగ సమానత్వం కాకుండా జాతీయ, మత, కుల, ప్రాంత, భాష భేదాలకు వ్యతిరేకంగా పోరాడే ప్రగతిశీల మహిళా ఉద్యమం ఐద్వా అన్నారు. ఈ నెల 13,14,15వ తేదీలలో అనంతపురంలో జరిగే ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల్లో జిల్లా వాసులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, నగర అధ్యక్షులు శంషదు, జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, గీత, శైలజ, పద్మావతి పాల్గొన్నారు.



ఐద్వా సాంస్కృతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

ముగిసిన సాంస్కృతిక ఉత్సవాలు

ఐద్వా రాష్ట్ర 16వ మహాసభ ఈనెల 13,14,15వ తేదీల్లో మూడు రోజల పాటు అనంతపురం నగరంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు అనంతపురం నగరంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. మొదటి రెండు రోజులు కృష్ణా కళామందిరంలో జరిగితే ఆఖరి రోజు శనివారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జరిగాయి. ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో ఆఖరి రోజు పెద్దఎత్తున బాలికలు, బాలురు పాల్గొని ప్రదర్శనలు చేపట్టారు. ఆట,పాటలతో సాగిన ఈ ఉత్సవాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ఐద్వా నాయకులు ప్రగతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సావిత్రిలతో పాటు ఆల్ ఇండియా రేడియో ప్రవక్త శ్యామ సుందర శాస్త్రి, కవి రియాజుద్దీన్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నాయకులు రామాంజినమ్మ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరి, పరమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సమాజంలో నేటికి అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కుటుంబం నుంచి మహిళ పట్ల వివక్ష, చిన్నచూపు ఉంటోందని పేర్కొన్నారు. సమానత్వం కోసం పోరాడేదే ఐద్వా అని తెలిపారు. ఐద్వా సాగిస్తున్న ఈ పోరాటంలో అందరూ భాగస్వామ్యులై నవ సమాజాభివృద్ధికి తోడ్పాటునందివ్వాలని పిలుపునిచ్చారు.

ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి డాక్టర్ ప్రసూన ఐద్వా నాయకులు

అనంతపురం నగరంలో ఈనెల 13 నుంచి జరుగుతున్న ఐద్వా 16వ రాష్ట్ర మహాసభను అందరూ జయప్రదం చేయాలని ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన పిలుపునిచ్చారు. ఈనెల 13వ తేది ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ ఆరంభమవుతుందన్నారు. అనంతరం లలిత కళాపరిషత్ హాలులో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సాంస్కృతిక ఉత్సవాల్లో చిన్నారుల ప్రదర్శన



సాంస్కృతిక ఉత్సవాలను వీక్షిస్తున్న మహిళలు, విద్యార్థినులు

వైద్యసేవల నుంచి తప్పకునే కుట్ర

- ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలలను నడపాలి
- పిపిపి మోడల్ విధానంతో అన్ని విధాలా నష్టం
- రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పిపిపి మోడల్ పేరుతో ప్రభుత్వ కళాశాలలను ప్రయివేటు పరం చేసే కుట్ర చేస్తోందని, ఇది పేదలను ప్రభుత్వ వైద్యానికి, పేద విద్యార్థుల ప్రభుత్వ వైద్య విద్యకు దూరం చేయడం అవుతుందని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అభివృద్ధి వేదిక నాయకులు రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గేయానంద్ మాట్లాడుతూ పెనుకొండలోని వైద్య కళాశాలకు గత ప్రభుత్వం రూ.30 కోట్ల ఖర్చు పెట్టిందన్నారు. ఇప్పుడు ప్రయివేటుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫీజులు నామ మాత్రంగా ఉంటాయని, ప్రయివేటు పరం అయితే లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకృతి వనరులను ప్రయివేటు పరం చేయడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. కార్పొరేట్‌లకు వేల కోట్ల అప్పులు మాఫీ చేస్తారు కానీ వైద్య కళాశాలల నిర్మాణానికి రూ. 3 వేల కోట్లు ఖర్చు చేయకపోవడం దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహులు మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తే ప్రజల నుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాల నిర్మాణం చేపట్టాలన్నారు. జెవివి రాష్ట్ర నాయకులు ఆదిశేషు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా పిపిపి మోడల్ విజయవంతం కాలేదన్నారు. పుట్టపర్తి రమణారెడ్డి మాట్లాడుతూ పిపిపికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కరోనాలో ఆదుకున్నది ప్రభుత్వ వైద్యమే అని, ప్రయివేటు పరం చేస్తే పేదలు, మధ్య తరగతికి విద్య, వైద్యం దూరం అవుతాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఓ మాట తర్వాత ఓ మాట చెప్పి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను దూరం చేయడం భావ్యం కాదన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, జడ్పి శీన, ఈఎస్.వెంకటేష్, పెద్దన్న, రైతు సంఘం జిల్లా నాయకులు ఫక్రుద్దీన్, గిరీష్, శ్రీనివాసాచారి, సిఐటియు నాయకులు సదాశివ, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, షబానా, రమాదేవి, ఎడబ్ల్యు డబ్ల్యు నాయకులు భావమ్మ, కెవిపిఎస్ జిల్లా నాయకులు రమణ, ఆంజనేయులు, ముత్యాలు, నారాయణ, గంగాధర్, వెంకటరాముడు, నారాయణస్వామి, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నామాల నాగార్జున, జెవివి నాయకులు మహేంద్రరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎఐఎస్ఎఫ్ నాయకులు శివ, ప్రముఖులు అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి పరిశీలన

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ వార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఏ రోగాలకు వైద్య పరీక్షలు అందిస్తున్నారని వైద్యులను అడిగారు. మహిళలు, పురుషుల వార్డులను పరిశీలించి వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య మిత్రతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'చెకుముకి' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద శనివారం జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి మండల ప్రధాన కార్యదర్శి రంగనాథ్, జిల్లా నాయకులు పి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 18న పాఠశాల స్థాయి, వచ్చేనెల 1వతేదీన మండల స్థాయి, 23న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, జెవివి నాయకులు శ్రీధర్‌గౌడ్, ఎం.రమేష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

ఆకుతోటల రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

జిల్లాలోని ఆకుతోటల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కిష్టిపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన ఆకుతోటలను పరిశీలించి రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుతోటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆకుతోటల రైతులు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. 30 సట్టల ఆకులు కనీసం రూ.200 కూడా ఉండటం లేదని రైతులు వాపోతున్నారన్నారు. 30 సట్టల ఆకులు కనీసం రూ.800 కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణమైన పరిస్థితులు ఉన్నా సంబంధిత అధికారులు కనీసం చూసేందుకు కూడా రాకపోవడం బాధాకరమన్నారు. ఎవరూ సలహాలు, సూచనలు ఇచ్చిన పాపానపోలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం పరిశీలించి ఆకుతోటల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపోంలో రైతులను కలుపుకుని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం అధ్యక్షులు మద్దిలేటి, పెద్దయ్య, రైతు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆకుతోటల రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

గ్యాస్ సిలిండర్లు పక్కదారి.!

గృహ బండలను వ్యాపారాలకు వాడుతున్న వైనం - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలం వ్యాప్తంగా గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండియన్, హెచ్‌పి, భారత్ వంటి కంపెనీలకు చెందిన గృహ గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగించకూడదు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. మండలవ్యాప్తంగా వేలసంఖ్యలో గృహ గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వాణిజ్య గ్యాస్ కనెక్షన్లు మాత్రం వేలసంఖ్యలో మాత్రమే ఉన్నాయి. వ్యాపార అవసరాలకు వినియోగించే వాణిజ్య గ్యాస్ కనెక్షన్ల సంఖ్యకు అనుగుణంగా నిబంధనల మేరకు వినియోగం ఉండడం లేదు. 19 కిలోలు, 5 కిలోల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే కాఫీ, టిఫిన్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, భజ్జీకొట్లు, కళ్యాణ మండపాలు, తదితర అనేక వ్యాపార సంస్థల యజమానులు వద్ద భారీగా డొమెస్టిక్ సిలిండర్లనే వాడుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 200 వరకూ గ్యాస్ ఉపయోగించే దుకాణాలు ఉంటాయి. ఈ సంఖ్యకు అనుగుణంగా వాణిజ్య సిలిండర్లను వాడాల్సి ఉండగా కేవలం వందల్లోనే వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరందరూ ఎక్కువగా గృహ అవసరాలకు వాడే సిలిండర్లనే ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ రూ.2వేలకుపైనే ఉంది. గృహ అవసరాల సిలిండర్ కేవలం రూ.870 మాత్రమే. ధరలో సగానికిపైగా తేడా ఉండటంతో వ్యాపారులు డొమెస్టిక్ బండలపైనే మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలను పక్కనపెట్టి గృహ అవసర సిలిండర్లను వాణిజ్య దుకాణాలకు సైతం వేస్తుండడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ అక్రమ వాడకందారులపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.



గృహ సిలిండర్‌ను హోటల్‌లో వాడుతున్న దృశ్యం

కునుకేస్తే కనుమరుగు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూమి పత్రాలు ఇంట్లో సురక్షితంగా ఉన్నాయి... తమకు భయం లేదనే రోజులు పోయాయి. ఏ మాత్రం కునుకేసిన అధికారిక రికార్డుల్లో పేర్లు మారిపోతున్నాయి. భూమి విలువ పెరుగుతుండటంతో దాన్ని ఏదో రకంగా తమ వశం చేసుకోవడానికి కొంత మంది ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ వ్యవహారం ఎవరు అధికారంలో ఉంటే వారి వైపు నుడస్తూనే ఉంది. గత ప్రభుత్వ హయాంలోనూ ఇదే రకంగా అనేక ప్రాంతాల్లో భూములు తమకు తెలియకుండానే మారిపోయాయి. అసలు యజమానులు తామేనంటూ రికార్డుల్లో సృష్టించి అమ్మకాలు సాగించారు. పదుల ఎకరాల్లోనే ఈ వ్యవహారం నడిచిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. తరువాత కేసులు కూడా నమోదయిన ఘటనలున్నాయి. ఇక ప్రభుత్వ భూములయితే లెక్కలేదు. వాటిని అడిగేవారు కూడా లేకుండా అయిపోయారు. వీటికి వ్యతిరేకంగా అప్పుడు టిడిపి నీతులు మాట్లాడారు. వారు అధికారంలోకి వచ్చాక కూడా ఇవే కొనసాగుతున్నాయి. వరుసగా ఇతరుల భూములు రికార్డుల్లో మారిపోయాయని బాధితులు బయటకు వస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రమైన అనంతపురం నగరం చుట్టుపక్కల భూముల ధరలు అధికంగా ఉండటంతో ఈ వ్యవహారం జోరుగా సాగుతోందన్న విమర్శ ఉంది. తాజాగా ఈ వారంలో ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో ఇద్దరు వృద్ధ దంపతులు తమకు జరిగిన అన్యాయం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వద్దకెళ్లి మొరపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ తరువాతగాని అధికార యంత్రాంగంలో కదలిక రాలేదు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు అది డబుల్ రిజిస్ట్రేషన్ అని తేల్చారు. అయినా చర్యలేమేరకు ఉంటాయన్నది చూడాల్సింది. అదే విధంగా ఇదే వారంలోనే గుంతకల్లు, గుత్తి ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూములు పరాధీనం అయినట్టు పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి. గతంలోనూ అనంతపురం నగరంలో కక్కలపల్లి, అనంతపురం నగరంలో దుకాణాలు డబుల్ రిజిస్ట్రేషన్ అయి బాధితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే వారంలోనే జిల్లా కలెక్టర్ ఆనంద్ సమీక్షలోనూ రెవెన్యూ అధికారుల అడ్డగోలు పనితీరు వెలుగులోకి వచ్చింది. సెక్షన్ 25వ కింద దరఖాస్తు చేసినవి ఫైల్లే కనబడలేదు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో రికార్డుల కోసం రెవెన్యూ అధికారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అనంతపురం జిల్లాలో ఐసిడిఎస్ పరిధిలో అధికారుల అలసత్వానికి రెండు నెలల బాలుడు మరణించడం రాష్ట్ర స్థాయిలోనే చర్చనీయాంశమైంది. దీనిపై ఇప్పటికే ఐసిడిఎస్ పీడీతోపాటు ఇతరులపై వేటు పడింది. ఇది మరువక ముందే బ్రహ్మసముద్రం మండలంలోని కెజిబివిలో బాలిక మృతి చర్చనీయాంశమవుతోంది. ఇలా వరుసగా అధికారుల పనితీరులోని లోపాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. వీటిని ప్రభుత్వం ఏ మేరకు సరిచేస్తుందన్నది చూడాల్సి ఉంది. ఐద్వా 16 రాష్ట్ర మహాసభ ఈనెల 13 నుంచి అనంతపురం నగరంలో జరుగుతున్న నేపథ్యంలో ఈ వారంలో రోజులపాటు వివిధ రూపాల్లో సన్నాహక కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల పాటు జరిగిన సాంస్కృతిక ఉత్సవాలు అందరినీ అలరించాయి. ఇక వచ్చే వారంలో మూడు రోజులపాటు అనంతపురం నగరంలోని ఎంకెఎం హాలులో మహాసభ జరుగనుంది.

'పురం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొస్తాం - రైతులకు గిట్టుబాటు ధర అందించే బాధ్యత నాదే - ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ తెలియజేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివద్ధి కమిటీ, వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎపిఐఐసి, రెవెన్యూ అధికారులతో మలగూరు, చలివెందల పొలాలకు సంబంధించి జరుగుతున్న భూ సేకరణపైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ విలేకరులతో మాట్లాడారు. హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి పాలనలో ఆసుపత్రికి అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలియజేశారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. మార్చురీ గది నిర్మాణానికి రూ.79 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. ప్లాస్మా థెరపీని అందుబాటులోకి తీసుకొచ్చి రెఫర్ల సంఖ్యను తగ్గిస్తామన్నారు. స్కానింగ్, సిటీ స్కానింగ్ అందుబాటులో లేని నేపథ్యంలో రోగులకు అసౌకర్యం కలగకుండా పట్టణంలోని గురుస్కాన్‌లో పరీక్షలు నిర్వహించేలా ఎంఒయు చేసుకున్నామని చెప్పారు. త్వరలో రేడియాలజిస్ట్ నియమించి స్కానింగ్‌తో పాటు సిటీ స్కాన్ సేవలను సైతం అందుబాటులోకి తీస్తామన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

పారిశ్రామిక అభివద్ధి కోసమే భూసేకరణ

హిందూపురం ప్రాంతంలో ఏరో స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు వస్తున్నాయని బాలకృష్ణ తెలిపారు. వీటితోపాటు మరిన్ని పరిశ్రమలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు మంచి ధర ఇచ్చే బాధ్యత తమదన్నారు. మార్కెట్ ధర కన్నా అదనంగా రైతులకు భూ పరిహారమిచ్చి భూసేకరణ చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, తహశీల్దార్ వెంకటేశు, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ, ఆర్ఎంఒ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆడపిల్లలకు శాస్త్రీయ అవగాహన అవసరం

జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆడపిల్లలకు శాస్త్రీయ అవగాహన తప్పనిసరిగా అవసరమని జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన సూచించారు. జన విజ్ఞాన వేదిక మహిళా విభాగం సమతా ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం కురుగుంట బాలికల రెసిడెన్షియల్ హైస్కూల్లో 'ఎదిగే ఆడపిల్ల ఎమి తెలుసుకోవాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు చిన్న వయసు నుంచే తమపై తాను అవగాహన పెంచుకోవడంతోనే అపోహలు తొలగి పరిపక్వత సాధ్యమవుతుందన్నారు. దానివల్ల జాగ్రత్తగా వ్యవహరిస్తారన్నారు. ఒక కుటుంబం ఎదుగుదల శాస్త్రీయ అవగాహన కలిగిన ఆడపిల్లపైనే ఆధారపడి ఉంటుందని, దాన్ని పెంచుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సదస్సు అనంతరం 'ఎదిగే ఆడపిల్ల ఏం తెలుసుకోవాలి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, సమతా జిల్లా కన్వీనర్ రాధ, ప్రిన్సిపాల్ సునీత, సమతా నాయకులు నాగరత్న, లక్ష్మి, జెవివి నాయకులు తిరుపాల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎదిగే ఆడపిల్ల ఏం తెలుసుకోవాలి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

బాలికల ఆరోగ్యంతో సామాజిక అభివృద్ధి

హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుమ్మగట్ట

కిషోర బాలికల ఆరోగ్యాన్ని పరిరక్షించడం ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కించే లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండలంలోని పూలకుంట గ్రామంలో కిషోర బాలికలతో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాలిక విద్యను పెంపొందించడంతోపాటు బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. తరతరాలుగా ఆడ కూతురిపై అన్యాయాలు, అత్యాచారాలు బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈతరంలో లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడకూతురు వద్దని భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని, ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బాల్య వివాహాలు చేసుకోమని.. చదువుకుంటామని యుక్త వయస్సు బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ చాందిని, అంగన్వాడీ వర్కర్, ఆశా కార్యకర్తలు కావ్యశ్రీ, కిషోర్, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మఘట్ట మండలంలో అమ్మాయిలతో ప్రతిజ్ఞ చేస్తున్న లక్ష్మీనారాయణ

రాయదుర్గం : అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎన్‌సిసి క్యాడెట్ ఆసియా భానును శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థిని ఆసియాభాను ఆలిండియా తల సైనిక్ క్యాంప్‌లో పాల్గొని జిల్లా నుంచి క్యాంప్‌లో మెడల్ సాధించిన ఏకైక క్యాడెట్ కావడం గర్వకారణమన్నారు.

బస్సు సమయం మార్చండి సార్..!

నార్పల-అనంతపురం బస్సు ప్రయాణంపై ప్రయాణికుల అభ్యర్థన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రం నుంచి అనంతపురం వెళ్లే ఆర్టీసీ బస్సు సమయాన్ని పెంచాలని మండలంలోని ప్రయాణికులు కోరుతున్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల నుంచి పలువురు ప్రయివేటు ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ పనుల చేసేవారు పనులు ముగించుకుని తిరిగి చేరాలంటే బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్పల నుంచి అనంతపురం వెళ్లాలంటే రాత్రి 7 గంటలకు చివరి బస్సు ఉంది. ఆ బస్సు తప్పిపోతే ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో రావాల్సిందే. చేసేదిలేక ప్రయివేటు వాహనాల్లో వచ్చి పోతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాల్లో పలువురు మరణించడంతోపాటు మరికొందరు గాయాలపాలయ్యారు. నార్పల నుంచి అనంతపురానికి వెళ్లే చివరి బస్సు సమయాన్ని 8 గంటల వరకూ పెంచాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే సమస్యను ఇటీవల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సైతం పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తిన విషయం తెలిసిందే. ఇప్పటికైన అధికారులు, ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి చివరి బస్సు సమయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



నార్పల-అనంతపురం బస్సు

'పివికెకె'లో ఆధునిక విఎల్ఎస్ఐ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (పివికెకె)లో ఎఐఎఎన్ఎస్ఐ బెంగళూరు సంస్థ సహకారంతో అత్యాధునిక విఎల్ఎస్ఐ డిజైన్ ల్యాబొరేటరీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ విఎల్ఎస్ఐ టెక్నాలజీ భవిష్యత్తు ఇంజినీర్లకు మంచి ఉపాధి అవకాశాలను అందిస్తుందన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని పరిశ్రమ అవసరాలకు తగిన విధంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ ల్యాబ్ ఏర్పాటు ద్వారా పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రయోగాత్మక బోధన, పరిశోధన, మరియు పరిశ్రమ సంబంధాలు వంటి రంగాల్లో మరింత ముందడుగు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దానా, ఎఓ మనోహర్‌రెడ్డి, అనురాగ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విఎల్ఎస్ఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ముగిసిన విద్యానికేతన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం వేణుగోపాల్ నగర్‌లోని విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో స్థానిక పిటిసి మైదానంలో నిర్వహిస్తున్న విద్యానికేతన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ శుక్రవారం ముగిసింది. ఆసక్తిగా సాగిన ఫైనల్ మ్యాచ్ టెన్త్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. అనంతరం ఏర్పాటు చేసిన ట్రోఫీ ప్రదానోత్సవంలో జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ హాజరై విన్నర్, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందిస్తున్న విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ క్రికెట్ లీగ్‌లో విజేత జట్టుకు, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బెస్ట్ బ్యాట్స్‌మెన్ బాబా ఫక్రుద్దీన్, బెస్ట్ బౌలర్ వెంకట్ సాత్విక్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భరత్ నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా సహాయ కార్యదర్శి అవుకు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న టిసి వరుణ్

పింఛను ఇప్పించడమ్మా..!

ఎమ్మెల్యేతో అనాథ వృద్ధురాలు సుంకమ్మ వేడుకోలు

ప్రజాశక్తి-శింగనమల

'అమ్మా.. నేను అనాథను.. కుటుంబ పోషణ భారంగా ఉంది.. పింఛన్ మంజూరు చేయించి ఆదుకోండి.. అమ్మా.. అంటూ అనాథ వృద్ధురాలు సుంకమ్మ వేడుకుటోంది. మండల పరిధిలోని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్వగ్రామం అలంకరాయణపేట గ్రామంలో వృద్ధ దంపతులు బాలప్ప, సుంకమ్మ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎవరూ లేరు. దీంతో గ్రామంలోని పూరి గుడిసెలో నివాసం ఉంటూ ఇళ్లిళ్లు తిరుగుతూ అన్నం అడ్డుకుని తింటూ ఉంటారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ఆ వృద్ధురాలు వంకర తిరిగిన కాళ్లు, చేతులతో వణుకుతూ వచ్చి పింఛన్ కోసం వేడుకుంటూ ఉంటోంది. అంతేగాకుండా మండలంలోని ప్రతి కార్యాలయం చుట్టూ తిరిగింది. అయినా ఎవరూ పింఛన్ మంజూరు చేసిన పాపాన పోలేదు. ఈనేపథ్యంలోనే గత బుధవారం గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసేందుకు ఎంపి తలారి రంగయ్య శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, తదితరులు వచ్చారు. విషయం తెలుసుకున్న వృద్ధురాలు సుంకమ్మ కర్ర సాయంతో వణుకుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వద్దకు వచ్చి 'తల్లీ.. నాకు, నా మొగుడికి ఎవరూ లేరు.. జీవనం కష్టంగా ఉంది.. పింఛన్ మంజూరు చేయించి ఆదుకోండి తల్లీ..' అంటూ దీనస్థితిలో అడుక్కుంది. అక్కడే ఉన్న ఎంపి వృద్ధురాలి వద్దకు చేరుకున్నాడు. వారిద్దరూ అక్కడే అధికారులను పిలిచి సుంకమ్మకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. దీంతో ముసలవ్వ బోసి నవ్వులతో ఇంటి బాట పట్టింది. కనీసం ఈసారైనా పింఛన్ మంజూరు కావాలని వృద్ధురాలితోపాటు స్థానికులు కోరుతున్నారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న వృద్ధురాలు సుంకమ్మ

'ధనధాన్య'తో రైతులకు ఆదాయం

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధనధాన్య కృషి యోజన పథకం ద్వారా రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి మాట్లాడుతూ వ్యవసాయం, ఆధారిత విభాగాలకు ధన ధాన్య యోజన కింద నరేంద్ర మోడీ విడుదల చేసిన వివిధ పథకాలు, నీటి సద్వినియోగం కింద డ్రిప్ సరఫరా చేయడంలో అనంతపురం జిల్లా 2వ స్థానంలో ఉందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి అధికారులు హాజరై ఆయా విభాగాల్లో నూతన సాంకేతికత, యాజమాన్య పద్ధతులు, వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం రేకులకుంట నుంచి విజయ్ శంకర్‌బాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, పశుసంవర్ధక శాఖ అధికారులు రామచంద్రారెడ్డి, పద్మలత, ఉద్యాన అధికారిణి శైలజ, ఎంపిపి సునీత, శాస్త్రవేత్తలు జిటి త్రికాల మాధవి, కె.సుధారాణి, జి.శశికళ, బికె కిషోర్‌రెడ్డి, కె.మాధవి, బి.చందన, జిల్లాలో వివిధ మండలాల నుంచి 400 రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపి అంబికా, శాస్త్రవేత్తలు

రబీలోనూ రైతులకు తప్పనితిప్పలు

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్‌తోపాటు రబీ సీజన్‌లోనూ రైతులకు తిప్పలు తప్పడం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి గగమ్యగోచరంగా మారిందన్నారు. రైతుల కష్టాలను వైసిపి నాయకులు ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. విత్తన సరఫరా నుంచి ఎరువులు అందుబాటులోకి తేవడం వరకు పూర్తిగా ప్రభుత్వం వైఫల్యం చెందుతోందని ఆరోపించారు. ఇక ఏపంటకూ గిట్టుబాటు ధర లేదన్నారు. చివరకు పంటలను రోడ్డుపాలు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోందన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వ్యాపారులకు కొమ్ముకాస్తోందన్నారు. జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 8.50 లక్షల ఎకరాలు కాగా ఈఏడాది జూన్, జూలైలో వర్షాలు కురవలేదన్నారు. జూన్‌లో సాగు చేసి వేరుశనగ, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాధారణంగా 4.50 లక్షల ఎకరాల్లో సాగు అవ్వాల్సి ఉండగా ఖరీఫ్‌లో 2.25 లక్షల ఎకరాల్లో మాత్రమే వేరుశనగ సాగు చేశారన్నారు. దీన్ని బట్టి ఎలాంటి పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయో అర్థమవుతోందన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ 50 శాతం కూడా కాలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి ఎలా వస్తామని ప్రశ్నించారు. ఇకపోతే ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి వైద్యసేవలు సజావుగా సాగేలా చూడాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి

'మిడ్‌పెన్నార్' అభివృద్ధికి రూ.5.20కోట్లు మంజూరు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు అభివృద్ధికి ప్రభుత్వం రూ.5.20కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో మిడ్‌పెన్నార్ ప్రాజెక్టులో రబ్బర్ సీల్స్ మార్పిడి, కొత్త వాక్‌వే బ్రిడ్జ్ నిర్మాణం, రేడియల్ క్రెస్ట్ గేట్లకు సాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తద్వారా ప్రాజెక్టు భద్రత, నిల్వ సామర్థ్యం, దీర్ఘకాలిక స్థిరత్వం మరింత బలపడుతుందన్నారు. గత 20ఏళ్లుగా పరిష్కారం కాని మూడు సౌత్ కెనాల్ స్లూయిస్ గేట్ల భర్తీ ఇప్పుడు సాధ్యమవుతోందన్నారు. దెబ్బతిన్న గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 1 టిఎంసి నీటి వృథాను నివారించవచ్చన్నారు. గతంలో 8వేల ఎకరాలకు అవసరమయ్యే సాగునీరు వృథాగా లీకేజీ ద్వారా వెళ్లేదని, ఇప్పుడు నివారించి సాగునీరు అందించవచ్చన్నారు. తద్వారా రైతులకు సాగునీరు నిరంతరంగా లభించడంతోపాటు ప్రజలకు తాగునీటి వనరులు మెరుగుపడతాయన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెరిగితే ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి కూడా చెందుతుందన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన సిఎం చంద్రబాబు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పక్కన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ (పాతచిత్రం)

ఫీవర్ సర్వే తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని ఆసుపత్రి కాలనీలో శనివారం చేపట్టిన ఇంటింటి ఫీవర్ సర్వేను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కాలనీ ప్రజలకు ఫ్రైడే డ్రైడేతోపాటు తొట్లలో ఉన్న లార్వాను గురించి వివరించారు. ప్రతి శుక్రవారం ఇంటి ఆవరణలోని పూలకుండీలను ఇంటి లోపల కూలర్లు, రెఫ్రిజిరేటర్ వెనుకభాగాల్లో ఉన్న బాక్స్‌ల్లో ఎక్కువ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కాలనీలోని ప్రజలు జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్త పూతలు తీయాలని ఎఎన్ఎం సుమంగళకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జుబేదా, ఎంపిహెచ్ఎస్ మేల్, ఫిమేల్ ఎ.రామ్‌ప్రసాద్‌గౌడ్, శోభాకుమారి, ఎఎన్ఎం సుమంగళ, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, నీలావతి, సారమ్మ, సువార్తమ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై నిరసన

అనంతపురం : రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం ఈనెల 13, 14వతేదీల్లో నిరసనలు తెలియజేయనున్నట్లు కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2లక్షల వరకు ఇవ్వాలన్నారు. ఈక్రాఫ్ నమోదు చేయాలని, నూతన కౌలు చట్టం అమలు చేయాలన్నారు. 13వతేదీన ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

ఎజిటియుపిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులుగా నాగరాజు

ప్రధాన కార్యదర్శిగా పెరవలి రమేష్

ప్రజాశక్తి-అనంతపురం

అఖిలగాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘ (ఎజిటియుపిఎస్ఎస్-ఎపి) జిల్లా అధ్యక్షులుగా చిగిచెర్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పెరవలి రమేష్ నియమితులయ్యారు. శనివారం నగరంలోని విజయనగర లా కళాశాల సెమినార్ హాల్లో 'గాండ్ల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎజిటియుపిఎస్ఎస్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు వాకాటి హరికృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గిరి శ్రీనివాస్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు మేడికుర్తి రెడ్డిరమేష్ సంయుక్తంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ప్రకటించారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షులుగా పని చేసిన జి.నరసింహుడును రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు. అలాగే ఎజిటియుపిఎస్ఎస్ జిల్లా కార్యవర్గంలోకి ఆదిశేషును తీసుకుంటూ ఏకగ్రీవంగా జిల్లా కార్యవర్గంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎజిటియుపిఎస్ఎస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కాలసముద్రం విజయలక్ష్మి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కె.పురుషోత్తమ కుమార్, జిల్లా కోశాధికారి సూర్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులు బసవరాజు, మల్లికార్జున, మహిళ ప్రతినిధులు కాలసముద్రం రత్నమ్మ, బచ్చుల శైలజ, తదితరులు పాల్గొన్నారు.



ఎజిటియుపిఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రమేష్

పేదలకు అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్. నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు నిర్వాహకులు, సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ అమ్మ జయమ్మ వర్ధంతి సందర్భంగా సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఓబుళపతి, నబిరసూల్, చంద్రశేఖర్, శ్రీరామకృష్ణ, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

గేట్స్‌లో 'విద్యార్థి ఆలోచించు'



అవగాహన కల్పిస్తున్న వందేమాతరం రవీంద్ర

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'విద్యార్థి ఆలోచించు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు వందేమాతరం రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన, జీవిత విలువలను చైతన్య పరిచారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో జాతీయత, నైతిక విలువలు, విజయ దిశగా ఆలోచించే దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ప్రేరణ పొంది, తమ జీవిత లక్ష్యాల వైపు దృఢంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఓ ఇంతియాజ్‌బాషా, సామాజిక గాయకులు లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

'పట్టు'లో అవినీతిపై చర్యకు డిమాండ్

పెద్దపప్పూరు : చేనేత కార్మికుల ఎన్‌హెచ్‌డిసి పట్టు రాయితీ పథకం చోటు చేసుకున్న అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతా పురుషోత్తం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపతోపాటు అనంతపురం జిల్లా యాడికి, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికుల ఎన్‌హెచ్‌డిసి పట్టు రాయితీ పథకంలో కొందరు అక్రమార్కులు బోగస్ సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని రూ.లక్షల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు కాశెట్టి నారాయణస్వామి, తలారి ఈశ్వరయ్య, వడ్డీ అంజనప్ప, తలారి రామకృష్ణ, చింతా హలుకిట్ట, గుర్రం మల్లికార్జున, గద్దె ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కెపి.కుంట గ్రామానికి చెందిన పూజారి సన్న క్యాతన్న(65) మృతికి టిడిపి నాయకులు శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్యాతన్న మృతదేహానికి పూలమలలు వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో వీరాపురం సర్పంచు నాగరాజు, బెలోడు సంజీవ, డీలర్ సత్యనారాయణ, తాళ్లకెర పాలయ్య, నాయకులు తలరి రాముడు, బుల్లెట్ ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.



క్యాతన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

'ఎస్ఆర్ఐటి'లో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

శింగనమల : బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామ వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మానవతా బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి అనుసంధానంతో ఏర్పాటు చేసిన శిబిరంలో దాదాపు 140 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే 4850 మంది విద్యార్థులు తమ రక్త గ్రూపును తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జి.చిన్నపుల్లయ్య, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల మహాసభ

పామిడి : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న మండల మహాసభను జయప్రదం చేయాలని వ్యకాసం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, పూర్వపు మండల కార్యదర్శి గజనాంపల్లి మల్లేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు జిల్లా అధ్యక్షులు సూరి, కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ప్రజా సంఘాల గౌరవాధ్యక్షులు బి.శ్రీనివాసులు హాజరవుతారన్నారు. కావున వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్జీవో ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎన్‌జిఓ హోంలో ఎన్నికల అధికారి ఎ.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా సాగాయి. అధ్యక్షులుగా ఎస్.తిరుపాలయ్య, సెక్రటరీగా ఎన్.రాకేష్, సహాధ్యక్షులుగా గంగరాజు, ఉపాధ్యక్షులుగా చరణ్, సుజాత, అచ్చమ్మ, జాయింట్ సెక్రటరీగా ఓబుళమ్మ, అనిల్, నల్లప్ప, కోశాధికారిగా సుభాషిణి, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా హబీబాను ఏకగ్రీవ ఎన్నికున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల మాధవ్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రటరీ చంద్రమోహన్, కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జిఓ నూతన కమిటీ సభ్యులు

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం చోరీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీ గురైంది. మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన కళ్యాణ్ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న బుకింగ్ కార్యాలయం వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి లోనికి వెళ్లారు. అనంతరం వచ్చి ద్విచక్ర వాహనాన్ని చూడగా అక్కడ లేకుండా పోయింది. చుట్టూ గాలించిన ద్విచక్ర వాహనం లేకపోవడంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు

యల్లనూరు : కడప జిల్లా లింగాల మండలం అంకేవానిపల్లి గ్రామానికి చెందిన మన్నెల సురేష్‌ను కొట్టి గాయపరిచిన నలుగురిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. లింగాల మండలానికి చెందిన సురేష్, పెద్దన్న మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఈనేపథ్యంలో సురేష్ యల్లనూరు మండలంలోని చిలమకూరు గ్రామానికి వచ్చి తిరిగి తన స్వగ్రామనికి వెళ్తుండగా యల్లనూరుకు చెందిన పెద్దన్న, పెద్దిరాజు, నరేష్, వెంకటరమణ కలిసి ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి సురేషను కొట్టి గాయపరిచారు. సురేష్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

దొంగలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

గుత్తి : పంట పొలాల్లో విద్యుత్ తీగలను చోరీ చేస్తున్న దొంగలపై చర్యలు తీసుకోవాలని ధర్మాపురం గ్రామానికి చెందిన పదిమంది రైతులు గుత్తి సిఐ రామారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు పి.శ్రీనివాస్ చౌదరి, కె.నాగేంద్ర, రాజేంద్రప్రసాద్, రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి పదిమందికి చెందిన రైతుల మోటార్లకు ఉన్న విద్యుత్తు రాగి తీగల చోరీ చేశారని చెప్పారు. దాదాపు రూ.1.20 నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. ప్రతిరోజు ఏదో గ్రామంలో చోరీ జరుగుతోందని దృష్టి సారించి దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.